నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్: మరమ్మతుల కారణంగా ఘట్‌కేసర్ సబ్‌స్టేషన్ 11 కేవీ యంనంపేట్ ఫీడర్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఘట్‌కేసర్ ఏఈ యశ్వంత కుమార్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు యంనంపేట్, ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, 11 బాలాజీనగర్ ఫీడర్ పరిధిలోని బాలాజీనగర్‌లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన ఆటో డ్రైవర్లు



మున్సిపల్ కమిషనర్‌తో ఆటో డ్రైవర్లు

మేడ్చల్: మేడ్చల్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన చంద్రప్రకాశ్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో మేడ్చల్‌కు చెందిన పలువురు ఆటో డ్రైవర్లు శుక్రవారం కలిశారు. ఆటోస్టాండ్‌లు, ఇతర సమస్యలను విన్నవించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు విజయరావు, నర్సింగ్‌రావు, సుధాకర్, సత్యనారాయణ ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత



కీసర: నాగారం మున్సిపాలిటీ వెస్ట్ గాంధీనగర్‌లో నివసించే మమత నివాసంలో షార్ట్ సర్క్యూట్‌తో వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి ఘటనా స్థలాన్ని సందర్శించి వారికి ఆర్థిక సాయంగా రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా వంగేటి బాపిరెడ్డి



కీసర: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహిస్తున్న గోధుమకుంటకు చెందిన వంగేటి బాపిరెడ్డి జిల్లా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టు అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతను అప్పగించారని మరింత బాధ్యతాయుతంగా పనిచేస్తానని తెలిపారు

రేషన్ బియ్యం పట్టివేత

పోచారం: రేషన్ బియ్యం వ్యాపారిపై పోచారం ఐటీసీ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు అన్నోజీగూడ సాయినగర్‌లో రేషన్ బియ్యం సేకరిస్తున్న యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం, బద్దుతండాకు చెందిన గుగులోతు శ్రీను (30)ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అన్నోజీగూడ, ఘనాపూర్, ఆర్‌జీకే, పరిసర ప్రాంతాల్లో తక్కువ ధరకు బియ్యం కొనుగోలు చేసి ఇతర ప్రాంతాల్లో ఎక్కువ ధరకు విక్రయిస్తుంటాడని తేలింది. అతడి నుంచి 4.4 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని పంచనామా చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో పశువుల మృతి

కీసర: కీసరగుట్ట వెళ్లేదారిలో విద్యుదాఘాతంతో పశువులు మృతి చెందాయి. పశువుల పాకపై విద్యుత్ తీగలు తెగిపడడంతో అదేదారిలో వెళ్తున్న రెండు గేదెలకు తగిలి కరంట్ షాక్‌తో మృతిచెందాయి. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఈ మేరకు విద్యుత్‌శాఖ వారు బాధిత రైతుకు ఆర్థిక సాయం అందించాలని వివిధ పార్టీల నేతలు డిమాండ్ చేశారు.


ఇంట్లో చోరీ

ఉప్పల్: పట్టపగలే ఇంట్లో చోరీ జరిగిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కావేరినగర్‌లో నివాసముండే అర్జున్ గౌడ్ టీ కొట్టు నడుపుతుంటాడు. సోదరి కుమారుడి ఫొటో షూట్ కోసం ఉదయం ఇంటికి తాళం వేసి వెళ్లాడు. సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువాలోని 4 తులాల బంగారం, రూ. 8 లక్షలు కనిపించకపోవడంతో బాధితుడు ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునిక్లూస్ టీంను పిలిపించి ఆధారాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తూకంలో తేడా..!

కిలోకు 100 గ్రాములు తక్కువ వస్తున్న వైనం

- దుకాణాలు, సూపర్ మార్కెట్లలో మోసం
- కూరగాయలు, చేపల మార్కెట్లలోనూ ఇదే తంతూ
- మొక్కుబడిగా తనిఖీలు
- మోసపోతున్న వినియోగదారులు



సాక్షి,సిటీబ్యూరో: మల్కాజిగిరి మార్కెట్లో స్వప్న 250 గ్రాములు (పావు కిలో) కాకరకాయలు కొనుగోలు చేసింది. వాటిని ఎలక్ట్రానిక్ తూకం వేయిస్తే 230 గ్రాములు చూపిస్తోంది. దీంతో 20 గ్రాములు నష్టపోయింది. అలాగే ఉప్పల్‌లో 1000 గ్రాములు (కిలో) దానిమ్మ పండ్లు కొనుగోలు చేయగా, వాటిని మామూలు త్రాసుపై తూకం వేసి ఇచ్చారు విక్రయదారుడు. వాటిని ఎలక్ట్రానిక్ తూకం వేస్తే 890 గ్రాములే ఉన్నట్లు చూపిస్తోంది. 25 కిలోల బియ్యం బస్తాను తూకం వేస్తే 24.5 కిలోలు మాత్రమే ఉంటోంది. ఇందులో ఏది నమ్మాలో తెలియక వినియోగదారులు అయోమయానికి గురవుతున్నారు. వినియోగదారుల అవసరాలను ఆసరాగా చేసుకుంటున్న కొందరు వ్యాపారులు పలు రకాలుగా మోసాలు చేస్తున్నారు. తూకాల కొలతల్లో తేడాలు ఉంటున్నా.. చిరునామా లేని చిరు తిండి..ఆహార పదార్థాల పొట్లాలు సైతం మార్కెట్లను ముంచెత్తుతున్నా పట్టించుకునే వారే కరవయ్యారు. అధికారులు మాత్రం నామమాత్రపు తనిఖీలతో మమ అనిపిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కూరగాయల మార్కెట్లు..

గ్రేటర్‌తో పాటు శివారు జిల్లాల్లో వారంలో ఒక్కో రోజు ఒక వాడ, బస్తీ, గ్రామం చొప్పున కూరగాయల అంగళ్లు, చేపల క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. ఇక్కడే తూకాల్లో మోసాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఎలక్ట్రానిక్ కాంటా వచ్చినప్పటికీ కొందరు పాత రకపు త్రాసు వాడుతూ బండరాళ్లను తూకానికి ఉపయోగిస్తున్నారు. మార్కెట్లో కొనుగోలు చేసిన కూరగాయలను బయట ఎలక్ట్రానిక్ యంత్రంపై తూకం వేయిస్తే బరువు తక్కువగా ఉంటోంది.

సూపర్ మార్కెట్లలోనూ..

కిరాణ దుకాణాలు, కొన్ని సూపర్ మార్కెట్లలో ప్యాకెట్ల రూపంలో విక్రయించే వాటిపై తయారీ, నాణ్యతా ప్రమాణాలు, ఇతర వివరాలు ఉండడం లేదు. ఏదైనా వస్తువు, ఆహార పదార్థాలకు సంబంధించిన ప్యాకింగ్ పై ఉదాహరణకు 500 కిలో గ్రాముల ప్యాకెట్‌పై ఆదనంగా 150 గ్రాములు ఇస్తున్నట్లు ముద్రిస్తున్నారు. ఒకటి కొంటే మరొకటి, ఉచితమంటూ బోర్డులపై ప్రదర్శిస్తూ.. బిల్లు మాత్రం రెండింటికి చేస్తున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నగరంలో ఎలాంటి ప్రమాణాలు పాటించకుండా అనేక ఆహార పదార్థాల తయారీ కేంద్రాలు వెలిశాయి. గడువు తీరినా, కల్తీ జరిగినా ఎవరికీ ఫోన్ చేయాలో తెలియడం లేదు. కస్టమర్ కేర్ వివరాలు, ఫోన్ నంబర్ లాంటివి ఉండడం లేదు.

చేపల విక్రయంలో..

నగరంతో సహా శివారుల్లో చేపల మార్కెట్లోనూ వినియోగదారులు నష్టపోతున్నారు. లావుపాటి కవర్లలో చేపలు జోకడం, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు కాకుండా పాత రకపు తక్కెడ వాడుతుండడం కనిపిస్తోంది. బయట ఎలక్ట్రానిక్ యంత్రంపై తూకం వేయిస్తే 100 నుంచి 200 గ్రాముల వరకు తేడా వస్తున్నట్లు వినియోగదారులు చెబుతున్నారు. మరికొందరు ఎలక్ట్రానిక్ తూకం యంత్రాన్ని లీటర్ మోడ్‌లో పెట్టి తూకం వేస్తున్నారు. అందులో 1000 గ్రాములు కాకుండా 1000 అని మాత్రమే చూపిస్తోంది. లీటర్ మోడ్‌లో ఉంటే పాలు తీసుకుంటే 1000 (లీటరు) ఎంఎల్ చూపిస్తుంది. ఘన పదార్థం తీసుకుంటే కిలోకు వంద గ్రాముల తక్కువ అంటే.. తూకం 900 గ్రాములు వస్తోంది.

పెట్రోల్ బంకుల్లోనూ అదే తంతూ..

పెట్రోల్, డీజిల్ పోయించుకునేప్పుడు ప్రతి వాహనదారుడు జీరో రీడింగ్ చూసుకోవాలి. అప్పటికీ పెట్రోల్ తక్కువగా వస్తోంది అనుకుంటే తనిఖీ చేసుకోవచ్చు. ప్రతి బంకులో 5 లీటర్ల క్యాను ఉంటుంది. అందులో 5 లీటర్ల పెట్రోలు పోసి పరిశీలించవచ్చు. తక్కువగా వస్తే అధికారులకు ఫిర్యాదు చేయాలి. కల్తీ జరిగిందని అనుమానం వస్తే వారి వద్ద ఉన్న ఫిల్టర్ పేపరును అడిగి తీసుకోవాలి. దానిపై రెండు చుక్కలు వేస్తే ఆవిరైపోతుంది. కల్తీ ఉంటే పేపర్‌పై మరక అవుతుంది.

◆ వాహనదారులు తరచూ బంకుల్లో పెట్రోల్ పోయిస్తుంటారు. కొన్ని చోట్ల పెట్రోల్, డీజిల్ లీటరు కంటే తక్కువగా వస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఏదైనా సెట్టింగ్ చేస్తున్నారా..? అనే అనుమానాలను వాహనదారులు వ్యక్తం చేస్తున్నారు. ఘన, ద్రవ ఆహార పదార్థాలు ప్యాక్ చేసి విక్రయించాలంటే అనుమతి ఉండాలి. ప్యాకింగ్ పూర్తి వివరాలు, డిక్లరేషన్ ఉండాలి. కనీసం బిల్లులు కూడా ఇవ్వడం లేదు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడడంతో పాటు వినియోగదారులకు నష్టం కలుగుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తూకం మోసాలను అరికట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

పకడ్బందీగా 100 రోజుల ప్రణాళిక అమలుకు కృషి



తడి,పొడి చెత్త సేకరణపై సూచనలిస్తున్న కమిషనర్

మేడ్చల్: పట్టణాల్లో సమస్యల పరిష్కారం, అభివృద్ధి కోసం మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న '100 రోజుల ప్రణాళికలు' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాశ్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ అధికారులతో కలిసి పట్టణంలో పలు వార్డుల్లో శుక్రవారం పర్యటించారు. తడి పొడి చెత్త వేరు చేయడం, వేర్వేరుగా సేకరించేందుకు నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో పాల్గొని పలు సూచనలు చేశారు. పట్టణంలోని నర్సరీలను పరిశీలించి వన మహోత్సవం నాటికి మొక్కలు సిద్ధం చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. మూత్రశాలలను పరిశీలించి ఎస్ఎస్‌జీ స్కూల్‌లో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఆయన వెంట ఎన్విరాన్‌మెంట్ ఏఈ జ్ఞానేశ్వర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంచందర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజబాబు సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం 'సీఎం సహాయ నిధి'



చెక్కులు అందజేస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్

శామీర్‌పేట్: సీఎం సహాయనిధి నిరుపేదలకు వరమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్ అన్నారు. మూడు చింతలపల్లి మున్సిపాలిటీకి చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగ్గంగూడకు చెందిన పూజారి స్వామికి రూ. 37.500, కొల్తూర్‌కు చెందిన తాండరి ప్రసాద్‌కు రూ. 15 వేలు, బక్కగారి కృష్ణారెడ్డికి రూ. 60 వేలు, ఉడతల భిక్షపతికి రూ. 25 వేలు, కేశవరంకి చెందిన ఉడతల నర్సింహులుకు రూ. 55 వేలు, ఉద్దమర్రికి చెందిన ముఖ్యర్ల శేఖర్‌కు రూ. 55 వేలు, సంపన్‌బోల్‌కు చెందిన మర్యాల లావణ్యకు రూ. 60 వేల చొప్పున మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులుయాదవ్, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాగులో వ్యర్థాలు వేస్తున్న లారీ పట్టివేత



మేడ్చల్: మేడ్చల్ పెద్ద చెరువు నుంచి శామీర్‌పేట్ పెద్ద చెరువులోకి ఉన్న వాగులో సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలను కలుపుతున్న లారీని మున్సిపాలిటీ పరిధిలోని పూడూర్‌కు చెందిన మత్స్యకారులు పట్టుకుని మున్సిపల్, పోలీసు, జిల్లా కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అధికారులు అక్కడకు చేరుకుని రూ.5 వేల జరిమానా విధించారు. వాగులో వ్యర్థాలను వదలడం వల్ల మత్స్య సంపదకు నష్టం వాటిల్లుతుందని, చేపలు చనిపోతున్నాయని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు డిమాండ్ చేశారు.

ఎమ్మార్‌సీఈలో అంతర్జాతీయ సదస్సు



పరిశోధనా పత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్‌సీఈ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఓఎస్‌ఐఈటీ సహకారంతో ఉజ్బెకిస్తాన్‌కు చెందిన సమర్కండ్ స్టేట్ యూనివర్సిటీ, మణిపాల్ యూనివర్సిటీ మలేసియాతో కలిసి నిర్వహించిన సదస్సులో మలేసియా, నోయిడా, చెన్నైకు చెందిన యూనివర్సిటీల ప్రొఫెసర్లు రెమ్యావల్లతోల్, రచనా, దీప్తి, ప్రభాకర్, కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. నూతన పరిశోధనలు, ఆవిష్కరణలు, అభివృద్ధిపై విద్యార్థులు, పరిశోధకులు, ప్రొఫెసర్లు తమ పత్రాలను సమర్పించారు.

ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడిగా హరిశంకర్

శామీర్‌పేట్: ఉమ్మడి శామీర్‌పేట మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా గట్టు హరిశంకర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, ఎన్నికల అధికారి రమేశ్ గుప్తా, జిల్లా ప్రధాన కార్యదర్శి బచ్చు నగేశ్ కుమార్ గుప్తా తెలిపారు. జగ్గంగూడలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ఉమ్మడి మండల సంఘం ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా అలియాబాద్ గ్రామానికి చెందిన గట్టు హరిశంకర్ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. పూర్తి స్థాయి కమిటీని త్వరలోనే ఏర్పాటు చేస్తామని, తాను అధ్యక్షుడిగా ఏకగ్రీవం అయ్యేందుకు సహకరించిన సభ్యులు, పెద్దలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమంగా మట్టిని తరలిస్తే చర్యలు



సీజ్ చేసిన లారీలు

కీసర: అనుమతుల్లేకుండా అక్రమంగా లారీల్లో మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటామని కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్ హెచ్చరించారు. కీసరగుట్ట సమీప ప్రాంతాల్లో ప్రభుత్వ అసైన్డ్ స్థలాల్లో పొక్లెయిన్‌తో శుక్రవారం మట్టి తవ్వకాలు చేపట్టి తరలిస్తున్న 4 లారీలను సీజ్ చేశామని తెలిపారు. ఒక్కో లారీకి రూ.10 వేల చొప్పున, పొక్లెయిన్‌కు రూ.20 వేల చొప్పున జరిమానా విధించామని పేర్కొన్నారు. మట్టిని తరలిస్తున్న వ్యక్తులతో పాటు లారీల యజమానులపై కేసులు నమోదు చేశామని తెలిపారు.

దమ్మాయిగూడ కమిషనర్‌ను కలిసిన నాయకులు



కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ నూతన కమిషనర్ వెంకట్‌రెడ్డిని సీపీఎం నాయకులు శుక్రవారం కలిసి శాలువాతో సత్కరించి మొక్కను అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వినోద, కీసర మండల కార్యదర్శి బంగారు నర్సింగ్‌రావు, అశోక్ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్‌గా రాజేశ్

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపల్ నూతన కమిషనర్‌గా పంజాల రాజేశ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సచివాలయం నుంచి ప్రమోషన్‌పై ఆయన ఇక్కడికి రాగా ఇప్పటి వరకు కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన చంద్రశేఖర్ అలియాబాద్ మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. అనంతరం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ముత్యాలు యాదవ్, రాధాకృష్ణముదిరాజ్ ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మల్లేశ్, అమర్, ఉదయ్‌రెడ్డి, ఆంజనేయులు యాదవ్, నాగరాజుముదిరాజ్, మాధవరెడ్డి, శ్రీనివాస్, ఫరూక్, సంజీవరెడ్డి, నర్సింగ్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, జంగయ్యయాదవ్, ఖయూమ్, శివ, మల్లేశ్‌యాదవ్, సురేశ్, రాజు, బాబు, అష్రాఫ్ పాల్గొన్నారు.



కమిషనర్ రాజేశ్‌కు అభినందనలు తెలుపుతున్న పావనీజంగయ్య, ముత్యాలు, రాధాకృష్ణ

మేడ్చల్ కమిషనర్‌తో బీఆర్‌ఎస్ నాయకులు

మేడ్చల్: మేడ్చల్ నూతన మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాశ్ రెడ్డిని ఆయన కార్యాలయంలో బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా పట్టణంలో నెలకొన్న సమస్యలను ఆయనకు వివరించారు. నాయకులు భాస్కర్‌యాదవ్, సందీప్‌గౌడ్, నాగరాజు, నవీన్‌రెడ్డి, రవికుమార్, ఈశ్వరయ్య, నర్సింగ్‌రావు, ప్రతాప్, ప్రభాకర్, రాజు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



దేశవ్యాప్త సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

కీసర: జూలై 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ నాయకుడు బంగారు నర్సింగ్‌రావు పిలుపునిచ్చారు. కీసరలో మండల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సమ్మె పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. కార్యక్రమంలో కుందన్‌పల్లి, శ్రీరామలింగేశ్వర స్వామికాలనీ, రాజీవ్ గృహకల్ప కాలనీలోని మున్సిపల్ వర్కర్స్ పాల్గొన్నారు.

మూసీ నీరు శుద్ధి కేంద్రానికి స్థలం కేటాయిపు



పోచారం: ఉమ్మడి ఘట్‌కేసర్ మండలంలో ప్రవహిస్తున్న మూసీ నది మురుగు నీరు శుద్ధి చేసేందుకు జీహెచ్‌ఎంసీ జలమండలి ఏర్పాటు చేస్తున్న కేంద్రానికి వెంకటాపూర్‌లో రెవెన్యూ అధికారులు స్థలం కేటాయించారు. సర్వే నంబర్ 174 లో 6.20 గుంటల భూమిని కేటాయించి తహసీల్దార్ రజనీ జలమండలి అధికారులకు అప్పగించారు. అలాగే సదరు స్థలంలో అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మేడ్చల్‌రూరల్: కుటుంబ కలహాలతో వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా చిట్కుల్ గ్రామానికి చెందిన గౌతమ్ (27) మునీరాబాద్‌లోని ఐఎఫ్‌బీఐలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూ మేడ్చల్ పట్టణంలోని హెచ్‌బీకాలనీలో కుటుంబీకులతో కలిసి ఉంటున్నాడు. గురువారం రాత్రి గౌతమ్ ఇంట్లోని బెడ్ రూంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. మృతుడికి భార్య శ్రీదేవి, 5 నెలల బాలుడు ఉన్నారు.

విద్యార్థి అదృశ్యం



దినేశ్‌రెడ్డి

ఘట్‌కేసర్: విద్యార్థి అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్‌కు చెందిన విదినేశ్‌రెడ్డి (14) తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఈనెల 26న ఉదయం 9 గంటలకు మంచిగా చదువుకోవాలని విద్యార్థినిని తల్లిదండ్రులు మందలించి పనులకు వెళ్లారు. దీంతో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టు పక్కల, తెలిసిన వారి వద్ద వెతికిన ఆచూకీ లభించకపోవడంతో పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మార్కెట్ కమిటీ కార్యదర్శి బాధ్యతల స్వీకరణ



నూతన కార్యదర్శి శ్రీనివాస్‌ను అభినందిస్తున్న పాలకవర్గం

మేడ్చల్: మేడ్చల్‌లోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ కార్యదర్శిగా ఎల్.శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నగరంలోని గుడి మల్కాపూర్ కమిటీ నుంచి గ్రేడ్-2 కార్యదర్శి నుంచి ప్రమోషన్‌పై గ్రేడ్-1 కార్యదర్శిగా ఇక్కడికి శ్రీనవాస్ బదిలీ అయ్యారు. ఆయనకు మేడ్చల్ కార్యదర్శితో పాటు గుడి మల్కాపూర్ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

స్వాగతం పలికిన కార్యవర్గం..

నూతన కార్యదర్శి శ్రీనివాస్‌కు మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్ డైరెక్టర్లు పాలకవర్గం స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు రేగు రాజు తదితరులు ఉన్నారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర



మేడ్చల్: మేడ్చల్ లో భక్తులు జగన్నాథ రథయాత్రను శుక్రవారం నిర్వహించారు. ఒడిస్సాకు చెందిన భక్తు లు పట్టణంలోని జాతీయ రహదారిపై అత్వెల్లిలోని జగన్నాథ ఆలయం నుంచి మేడ్చల్ వరకు రథ యాత్ర చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కీసర: రాంపల్లి ఇస్కాన్ ఆధ్వర్యంలో జగన్నాథ రథ యాత్రను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, నాయకులు, ఇస్కాన్ సభ్యులు పాల్గొన్నారు.


సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న వజ్రేశ్‌యాదవ్

మేడ్చల్: డబీల్‌పూర్‌కు చెందిన పలువురికి సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం మంజూరైంది. దీంతో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్ తన నివాసంలో నాయకులతో కలిసి మణికంఠకు రూ.57 వేలు, వెంకటేశ్‌కు రూ. 39,500 వేల విలువైన చెక్కులను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకుడు సల్ల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్లు నిర్మించాలని ఎంపీకి వినతి



ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

కాప్రా: ఈసీఐఎల్ ప్రాంతంలో ఫ్లైఓవర్ల నిర్మాణానికి మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ హామీ ఇచ్చినట్లు రెడ్డి జేఏసీ ప్రతినిధులు తెలిపారు. రాధిక చౌరస్తాతో పాటు పలు చోట్ల ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపీ ఈటల రాజేందర్‌ను శుక్రవారం కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీటితో పాటు మల్లాపూర్, ఆర్కేపురం రైల్వే బ్రిడ్జిలను విస్తరించాలని విజ్ఞప్తి చేయగా సానుకూలంగా స్పందించిన ఎంపీ ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ఫ్లైఓవర్లు నిర్మించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు రెడ్డి జేఏసీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి జేఏసీ కోచైర్మన్ పైళ్ల హరినాథ్‌రెడ్డి, ఉప్పల్ అధ్యక్షుడు తుమ్మల మధుకర్‌రెడ్డి, బీజేపీ నాయకులు మర్రి మోహన్‌రెడ్డి, జున్నూతుల రంగారెడ్డి, రామకృష్ణారెడ్డి, రాజారెడ్డి, కంచర్ల రవీందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అల్వాల్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని నేరేడ్‌మెట్ పోలీసులు సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో సైబర్ క్రైం కేసుల్లో డబ్బులు పోగొట్టుకున్న 22 మంది బాధితులకు కోర్టు ద్వారా ప్రాసెస్ చేసి రూ.2,49,377 లను బాధితులకు రీఫండ్ చేశారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో బాధితులకు ఆర్డర్ కాపీలను అందజేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కాంతయ్య, బాధితులు పాల్గొన్నారు.